# భారత దేశంలో
# కులం, లింగబేధం, మతతత్వం



ప్రకాశ్ కారత్

PSBH
ప్రజాశక్తి బుక్‌హౌస్

# భారత దేశంలో
# కులం, జెండర్, మతతత్వం

ప్రకాశ్ కరత్

అనువాదం

ఎస్ వెంకట్రావు

ప్రజాశక్తి బుక్‌హౌస్

*27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, రాఘవయ్యపార్కు వద్ద*

*విజయవాడ - 520 002. ఫోన్ : 0866 - 2577533*

**ప్రచురణ సంఖ్య** : 1669

**ప్రథమ ముద్రణ** : నవంబర్, 2020

**ప్రతులు** : 2000

వెల : ₹ 10/-

**ప్రతులకు**

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,
విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,
ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ
website : www.psbh.in
prajasaktipublishinghouse@gmail.com

149995

# భారత దేశంలో
# కులం, జెండర్, మతతత్వం

**(2017 జులై 29 నుండి 31 వరకు కేరళలోని తిరువనంతపురం ఇఎంఎస్ అకాడమీలో రైతు, వ్యవసాయ రంగ కార్యకర్తలకు జరిగిన అఖిల భారత రాజకీయ శిక్షణా శిబిరంలో పాఠ్యాంశము.)**

భారత దేశంలో కులం, జెండర్, మతతత్వ సమస్యలను మార్క్సిస్టులు వర్గ దక్కోణం నుండి చూస్తారు. కులం, లైంగిక అణచివేత, మతతత్వ ప్రమాదాలను మనం ఎలా ఎదుర్కొంటాం అన్నది మన దేశంలో వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకుపోడానికీ, జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదం చేయడానికీ అత్యంత కీలకమైన అంశం.

## 1
## కులం

భారత దేశంలో కులవ్యవస్థ మన సమాజంలోనూ, ఉత్పత్తి సంబంధాల్లోనూ అంతర్భాగంగా ఉంది. ప్రముఖ మార్క్సిస్టు సిద్ధాంతవేత్త డిడి కోశాంబి దీని గురించి ఇలా చెప్పారు: *"ఉత్పత్తి యొక్క ప్రాథమిక దశలో కులమే వర్గంగా ఉంది. అతి తక్కువ బలప్రయోగంతో ప్రాథమిక ఉత్పత్తిదారుడి నుండి అదనపు శ్రమను దోచేందుకు మతాన్ని ఉపయోగించుకుని ఏర్పాటు చేసిన సామాజిక చైతన్యం అది."*

అంటే సిద్ధాంత పరంగా చూస్తే, మనం కులవ్యతిరేక వైఖరిని తీసుకునేటప్పుడు, కుల వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించేటప్పుడు రెండు అంశాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాల్సి ఉంటుంది.

1) కులాన్ని కేవలం సమాజపు ఉపరితలంగా మాత్రమే పరిగణించ కూడదు. అది సమాజపు పునాదిలో కూడా భాగం.

అందువల్ల, కులాన్ని కేవలం పెట్టుబడిదారీ పూర్వ సంబంధాల్లో భాగంగా చూడ్డం తప్పు. కుల సంబంధాలు ఫ్యూడల్ సమాజంలో భాగం అని తరచూ చెబుతుంటారు. ఇందులో.. ఆధునిక బూర్జువా సమాజంలో కులం అంతరించి పోతుందన్న భావన ఇమిడి ఉంది. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ కులాన్ని వర్గంతో భర్తీ చేస్తుందనే భావన ఇమిడి ఉంది. కానీ ఇది తప్పుడు అభిప్రాయం. భారత దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకింద, కులదొంతర్ల సమాజంలో వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయి. పెట్టుబడిదారీ అభివృద్ధిలో కులం, వర్గం మధ్య పరస్పర సంబంధాలు మారుతూ వస్తున్నాయి. అదే సమయంలో కొన్ని కేటగిరీల్లో కులం, వర్గం ఒకే దొంతర (ఓవర్‌లాప్) అవుతు న్నాయి. ప్రస్తుతం ఉన్న కుల సంబంధాల్లోనే వర్గాలు ఏర్పడుతున్నాయి, రూపు దిద్దుకుంటున్నాయి.

ఉదాహరణకు, మనం భారత దేశంలో పెట్టుబడిదారీ వర్గాల పరిణామాన్ని వాటి కుల మూలాల నుండి విడదీసి అర్థం చేసుకోగలమా? ఉదాహరణకు, వైశ్యుల పాత్రను తీసుకోండి. అదే విధంగా కార్మిక వర్గం, గ్రామీణ శ్రామిక వర్గాల ఏర్పాటును వాటి కుల మూలాల నుండి వేరుచేసి చూడలేం. గ్రామీణ శ్రామిక వర్గంలో అత్యధిక శాతం మంది దళితులు, ఆదివాసీలు, అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన వారే. భాతర దేశంలో భూస్వామ్య వర్గంతోనూ, అర్ధ-ఫ్యూడల్ శక్తులతోనూ రాజీపడ్డం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందింది. అందువల్లనే మనం దేశంలో సమూలమైన వ్యవసాయ ప్రజాతంత్ర పరివర్తన జరగలేదు. కుల దొంతర్ల లక్షణాలే వర్గాల ఏర్పాటునూ రూపుదిద్దాయి.

అందువల్లనే మన పార్టీ కార్యక్రమం ఇలా చెప్పింది: "భారత దేశ

*వ్యవసాయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి పాత రూపాలను సంపూర్ణంగా నిర్మూలించడం ద్వారా జరగలేదు. దానికి భిన్నంగా అనేకరకాల పెట్టుబడిదారీ–పూర్వఉత్పత్తి సంబంధాలపైనా, సామాజిక వ్యవస్థా రూపాలపైనా అది రుద్దబడింది (సూపరింపోజ్ చేయబడింది). ఇక్కడ పురాతనాన్ని కొనసాగిస్తూనే 'ఆధునికం' అభివృద్ధి చెందింది. పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యవసాయంలోకీ, గ్రామీణ సమాజంలోకీ వేనవేల మార్గాల్లో చొచ్చుకుపోయిన వైనానికి భారత దేశం ఒక విస్తారమైన, సజీవ నిదర్శనం."*

అందువల్ల మనం కులాన్ని పెట్టుబడిదారీ పూర్వ లేక ఫ్యూడల్ సంబంధంగా చూడకూడదు. అది పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధాల్లోకి చొరబడిందన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి.

బి) దీని తరువాత మనం రెండో విషయానికి వద్దాం. అదేమంటే, వర్గం, కులం ఎలా ఒకదానితో మరొకటి పెనవేసుకుపోయాయి అన్నది.

మార్క్సిస్టు అవగాహన ప్రకారం మన దేశంలో బూర్జువాభూస్వామ్య వ్యవస్థ వర్గ దోపిడీ, కుల పీడనల ఆధారంగా మనుగడ సాగిస్తోంది. పాలక వర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించుకోడానికి సామాజిక దొంతర్లను ఉపయోగించుకుంటున్నారు.

కమ్యూనిస్టులు కుల వ్యవస్థ రద్దును కోరుకునేది... కేవలం కుల వ్యవస్థను సంస్కరించడం కోసమో లేక కొన్ని రకాల కుల వివక్షలను అంతం చేయడం కోసమో మాత్రమే కాదు. కుల–వ్యతిరేక పోరాటం వర్గ పోరాటంలో భాగం కానిదే కులవ్యవస్థను రద్దు చేయడం సాధ్యం కాదు. ఎందుకని?

డాక్టర్ బిఆర్ అంబేద్కర్, పెరియార్ రామస్వామి వంటి అనేక మంది గొప్పగొప్ప సామాజిక సంస్కర్తలు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. కానీ వారి ప్రయత్నాలవల్ల కొన్ని పరిమిత సంస్కరణలు మాత్రమే జరిగాయి. కుల వ్యవస్థను నిర్మూలించాలన్న వారి లక్ష్యం మాత్రం నెరవేర్చలేకపోయాయి. దానికి కారణమేమంటే వారు పెట్టుబడిదారీ వ్యవస్థనూ, బూర్జువా–భూస్వామ్య వ్యవస్థనూ రద్దుచేయబూనుకోలేదు.

మనం వర్గ దోపిడీకి, కుల పీడనకూ వ్యతిరేకంగా జమిలిగా పోరాడనిదే కుల–వ్యతిరేక పోరాటం ముందుకు పోదు.

ఎందుకిలా జరుగుతోందంటే... మనం దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి, బూర్జువా ప్రజాతంత్ర వ్యవస్థ ఏర్పాటు, ఎన్నికల రాజకీయాలు కొత్త పద్ధతుల్లో కుల వ్యవస్థలోకి చొరబడిపోయాయి. దాంతోబాటు కులంలోనే వర్గ దొంతరలు కూడా ఏర్పడ్డాయి. ఉదాహరణకు, ఇతర బలహీనవర్గాలు (ఓబిసి)నే తీసుకోండి. పెట్టుబడిదారీ అభివృద్ధిలో ఓబిసి ల్లోని ఒక సెక్షన్ భూస్వాములుగా, పెట్టుబడిదారీ వ్యవసాయదారులుగా మారిపోయారు. వాళ్లు దళిత వ్యవసాయ కార్మికులను దోపిడీ చేస్తున్నారు. అందువల్ల వర్గ దోపిడికీ, కుల పీడనకూ వ్యతిరేకంగా జరిగే పోరాటం ఒకదానితో ఒకటి పెనవేసుకుని సంక్లిష్టంగా మారిపోయింది.

అదే సమయంలో భూస్వాములు, గ్రామీణ ధనికుల మధ్య ఏర్పడిన కూటమికి వ్యతిరేకంగా ఓబిసి లకు చెందిన విస్తారమైన రైతాంగాన్ని సమీకరించాల్సి ఉంది. కానీ దీనికి... వారు వాళ్ల కులానికి చెందిన దోపిడీ వర్గాలతో కుల సౌహార్ద్ర సంబంధాలు కలిగి ఉండడం అడ్డువస్తోంది. కులాల ఆధారంగా ప్రజలను సమీకరించడం మీద బూర్జువా రాజకీయాలు ఆధారపడి ఉన్నాయి. ఇవి వారి కుల అస్థిత్వాన్ని పెంపొందిస్తున్నాయి.

రైతాంగంలో బూర్జువా పార్టీలు చొప్పించిన కుల విభజనలను అధిగమించడం కోసం, ఐక్యతను నిర్మించడం కోసం వారి వర్గ సమస్యలతో, కుల పీడన వంటి సామాజిక సమస్యలను కూడా కలిపి చేపట్టాలని మన పార్టీ వరుసగా అనేక మహాసభల్లో దిశానిర్దేశం చేస్తూ వస్తోంది. అయితే ఈ ఆదేశాన్ని అమలు చేయాలంటే మనం వర్గ–కుల డైనమిక్స్‌నూ గ్రామీణ ప్రాంతాల్లో వాటి పరస్పరాధారిత చర్యలనూ అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

విభిన్న రంగాల్లో వర్గ, కుల అమరికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నిర్థిష్టమైన ఎత్తుగడలను రూపొందించాలని పార్టీ 18వ మహాసభ రాజకీయ తీర్మానం పిలుపునిచ్చింది.

వర్గ ప్రాతిపదికపై రైతాంగ ఐక్యతను నిర్మించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

అదే సమయంలో కుల అస్థిత్వాలనూ, కుల విభజనలనూ విస్మరించడం ద్వారా ఈ పనిచేయడం సాధ్యం కాదు. ఒక ప్రాంతంలో కుల, వర్గ పరస్పర సంబంధాల గురించీ, కులాల్లోనే వర్గ విభజన గురించీ నిర్ధిష్టమైన అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే మనం అక్కడ నిర్ధిష్టమైన ఎత్తుగడలు రూపొందించగలుగుతాము. అక్కడ ఎటువంటి వర్గ డిమాండ్లు చేపట్టాలి, వాటితో పాటు వివిధ సెక్షన్లను ప్రభావితం చేస్తున్న కుల, సామాజిక పీడనలకు సంబంధించిన ఏ సమస్యలను చేపట్టాలి అన్న వాటిపై స్పష్టమైన అవగాహనతో ఈ ఎత్తుగడలు వేయగలుతాము.

బూర్జువా పార్టీలు కుల భావనలను తమ రాజకీయ, ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటాయి. ఆవిధంగా కుల విభజనను పెంపొందిస్తాయి. ఈ విధమైన కులాలవారీ చీలికలు, విభజనలను తిప్పి కొట్టేందుకుగాను మనం ఆర్థిక, సామాజిక సమస్యలను తెలివిగా ఉ పయోగించుకుని రైతాంగంలోని విభిన్న సెక్షన్ల మధ్య ఐక్యతను నెలకొల్పాలి.

మొత్తం మీద చూసినప్పుడు... కుల పీడన, కుల వివక్ష వంటి సామాజిక సమస్యలను చేపట్టి, వాటిని ప్రజాతంత్ర పోరాటాలకు వేదికలుగా మార్చాలని మన పార్టీ నొక్కి చెబుతోంది. ఈ విధంగా చేయడం ద్వారా మాత్రమే మనం కుల–అస్థిత్వాలను తిప్పికొట్టి శ్రామిక ప్రజల మధ్య విస్తారమైన ఐక్యతను నెలకొల్పగలం.

## 2

## జెండర్

ప్రస్తుత ఉత్పత్తి విధానం తన దోపిడీ వ్యవస్థను కొనసాగించడానికి కులాన్ని మాదిరిగానే జెండర్‌ను కూడా ఉపయోగించుకుంటోంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో అదనపు శ్రమను దోపిడీ చేయడానికి చౌకగా లభించే మహిళల శ్రమ ఒక ప్రధానమైన వనరు. మహిళల్లో ఎక్కువ మంది అసంఘటిత రంగంలో క్యాజువల్, కాంట్రాక్టు, తాత్కాలిక కార్మికులుగా పనిచేస్తుంటారు. వ్యవసాయంలో అత్యధిక వ్యవసాయ కార్మికులు మహిళలే. వారికి పురుషులతో సమాన వేతనాలు ఇవ్వరు. సామాజిక భద్రత కూడా ఉండదు. వివిధ ప్రభుత్వ పథకాల కింద

పనిచేస్తున్న “స్కీమ్ వర్కర్లు” మరో పెద్ద మహిళా శ్రామిక శక్తి. వారిని పూర్తి స్థాయి ఉద్యోగులుగా గుర్తించరు. ప్రభుత్వ ఉద్యోగస్తుల స్థాయి వేతనాలు ఉండవు. మహిళలు ఎటువంటి వేతనాల్లేకుండా కుటుంబ వ్యవసాయ క్షేత్రాల్లోనూ, ఇంటిలోనూ పనిచేస్తుంటారు. వారి పనిని అసలు పనిగానే గుర్తించరు.

ఏడు దశాబ్దాల బూర్జువాభూస్వామ్య పరిపాలన అన్ని రంగాల్లోనూ పితృస్వామ్యాన్ని నెలకొల్పింది. మహిళలు అనేక విధాలుగా– మహిళలుగా, కార్మికులుగా, పౌరులుగా దోపిడీకి గురవుతున్నారు. నయాఉదారవాద విధానాలు ఆర్థిక, సామాజిక రంగాల్లో మహిళలను దోపిడీ చేసేందుకు కొత్త రూపాలను సృష్టించాయి. దీని వల్ల మహిళలపై హింసాకాండ తీవ్రంగా పెరిగిపోయింది.

భూమి, ఇతర గ్రామీణ వనరుల యాజమాన్యంలో పితృస్వామిక సంబంధాలు కనిపిస్తాయి. దాని వల్ల వ్యవసాయంలో మహిళల పాత్రను గుర్తించడం లేదు. వాళ్లు వ్యవసాయ కార్మికులుగా, రైతులుగా, కుటుంబ పనిలోభాగంగా, పొలాల యాజమాన్యం చేసేవారిగా (గ్రామాల్లో మహిళలే నిర్వహించే కుటుంబాలు)... అనేక విధాలుగా శ్రమ చేస్తున్నారు. వ్యవసాయ కార్మికుల్లో 40 శాతం మంది మహిళలున్నారు. కానీ మహిళా వ్యవసాయ కార్మికులకు పురుషులకన్నా తక్కువ వేతనాలిస్తారు. కుటుంబ శ్రమలో భాగంగా మహిళలు ఇతర వ్యవసాయ పనుల్లో వేతనం లేని పనులెన్నిటినో చేస్తున్నారు.

కానీ, మహిళలకు రైతు అనే హోదానే ఇవ్వడం లేదు. సాధారణంగా వాళ్లు భూమికి యజమానులు కారు. భూమి హక్కులు వారికి ఉండవు. అందుకనే, జాయింటు పట్టాలివ్వాలన్న డిమాండు చాలా కీలకం అయింది. వామపక్షాల నాయకత్వంలోని ప్రభుత్వాలు మాత్రమే జాయింటు పట్టా విధానాన్ని తీవ్రంగా తీసుకుని అమలు చేస్తున్నాయి.

మహిళలను పురుషుల కింద పడిఉండే స్థాయికి కుదించి, వారి ఆత్మగౌరవాన్ని కించపరిచే అనేక రకాల సామాజిక సంప్రదాయాలకూ, క్రతువులకూ లోబడేట్టు చేస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ కింద కొన్ని సామాజిక దురాగతాలు పెరిగి పెద్దవైనాయి. వరకట్నం, వరకట్నాల కోసం మహిళలను వేధించడం వాటిలో ఒకటి. మహిళలను లైంగిక వాంఛలు తీర్చే వస్తువులగా

చూడ్డం, వారిపై గృహాల్లోనూ, బయటా పెరుగుతున్న హింసాకాండ... ఇవన్నీ కూడా మార్కెట్ శక్తులు, నయా–ఉదారవాద విలువలతోపాటే పెరిగిపోతున్నాయి.

కులం పరిధిలోనే వివాహాలు చేసుకోవాలన్నది కుల వ్యవస్థ మౌలిక లక్షణం. అంటే మహిళలు కులం బయటగానీ, ఉపకులం బయటగానీ మరొకరిని వివాహం చేసుకోడానికి వీల్లేదు. ఆ విధంగా కులం అనేది అధికంగా లైంగిక సంబంధాలపై ఆధారపడిన వ్యవస్థ. మహిళలపై లైంగికంగా, స్వయంప్రతిపత్తి రీత్యా పురుషాధిక్య నియంత్రణ లేకుండా అది మనజాలదు. దిగువకులాలవారూ, మహిళలూ తక్కువ వారని మనుస్మృతి చెబుతోంది. అందువల్ల మహిళలు మూడు విధాలుగా లైంగికంగా, కులం రీత్యా, వర్గ రీత్యా అణచివేతలకు గురవుతున్నారు. దీని వల్ల బాగా దెబ్బతింటున్న వారు దళిత మహిళలు.

అందువల్ల, మహిళా విముక్తి కోసం జరిగే పోరాటం, కులాధిపత్యానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం పరస్పర సంబంధం కలిగి ఉన్నాయి.

మహిళల అసమానత్వానికి వ్యతిరేకంగా, సమానత్వం కోసం జరిగే పోరాటాలు ప్రజాతంత్ర విప్లవం కోసం, సామాజిక విముక్తి కోసం జరిగే పోరాటాల్లో అంతర్భాగాలు. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక, రాజకీయ జీవితంలో స్వతంత్ర పాత్ర ద్వారా మాత్రమే మహిళాభివృద్ధి సాధ్యమవుతుంది. అందువల్ల సమానపనికి సమాన వేతనం, జాయింటు పట్టాలివ్వడం, ఆడపిల్లల విద్య కోసం ప్రత్యేక చర్యలు, మహిళలకు సామాజిక భద్రతా చర్యలు, మహిళలపై హింసాకాండ అంతం, పార్లమెంటులోనూ, శాసన సభల్లోనూ మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ వంటి డిమాండ్లు వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమంలో భాగం అయ్యాయి.

సమాజంలో పురుష్యాధిక్యత చాలా లోతుగా పాతుకుపోయింది. పార్టీలో కూడా ఇది ప్రతిబింబిస్తోంది. లింగ సమస్యలపైనా, పురుషాధిక్య ధోరణులను నిర్మూలించాల్సిన అవసరంపైనా అన్ని స్థాయిల్లో పార్టీ సభ్యులను ఎడ్యుకేట్ చేయడానికి చైతన్యపూర్వక కృషి చేయడం అవసరం.

# 3

# మతతత్వం

మతతత్వం అనేది ఆధునిక ధోరణి. బ్రిటిష్ పాలనా కాలంలో ఇది బయలుదేరింది. మతతత్వ సంస్థలు, ఉద్యమాలు 19వ శతాబ్దం మధ్యలో ఏర్పడి 20వ శతాబ్దం ప్రారంభంలో గణనీయంగా పెరిగాయి. మతతత్వం మతపరమైన లక్ష్యాల కోసం పనిచేయదు. ఇది ఒక రాజకీయ సిద్ధాంతం. నిర్దిష్ట మత అస్థిత్వం గల ప్రజలను రాజకీయ ప్రయోజనాలకోసం సమీకరించేందుకు ఏర్పన సిద్ధాంతం ఇది.

భారత దేశంలో జాతీయవాద భావన అనేది వలస పీడన పరిపాలనానుభవాల వల్ల పుట్టింది. అభివృద్ధి చెందుతున్న పాలక మధ్యతరగతి, మేధావి వర్గం పశ్చిమ దేశాల జాతీయవాద భావాలతో ప్రభావితమైంది.

హిందూ మతతత్వం లౌకిక జాతీయవాదాన్ని, లౌకిక రాజ్యాన్ని వ్యతిరేకించింది. భారత దేశం హిందూ రాజ్యంగా ఉండాలని వారు కోరుకున్నారు. వారి దృష్టి అంతా వలస పాలనకు ముందున్న ముస్లిం పాలకులపైనే ఉండేది. వారికి బ్రిటిష్ పాలనలో మగ్గడం కన్నా మళ్లీ ముస్లింల పాలన వచ్చేస్తుందన్న భయం ఎక్కువ ప్రమాదంగా కనిపించేది.

1857 తిరుగుబాటులో హిందూ, ముస్లిం రాజులు, జమీందారులు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడారు. ఈ అనుభవం తరువాత బ్రిటిష్ వాళ్లు "విభజించి, పాలించు" ఎత్తుగడను అనుసరించారు. భాతర ప్రజల మధ్య మత విభిజనలను ప్రోత్సహించారు.

ద్విజాతి సిద్ధాంతాన్ని మొదట సావర్కర్ ప్రతిపాదించారు. జిన్నా, ముస్లింలీగ్ దాన్ని అనుసరించారు.

దేశ విభజన మత విద్వేషాలను పెంచింది. దేశంలోని మత రాజకీయలపై శాశ్వత ముద్ర వేసింది.

## హిందూత్వ మతతత్వం

భారత దేశంలో 80 శాతం మంది ప్రజలు హిందువులు కాబట్టి

దేశవ్యాపింతగా హిందూ అస్థిత్వాన్ని పెంపొందించి రాజకీయంగా ప్రయోజనం పొందాలన్నది హిందూ మతతత్వ వాదుల ప్రయత్నం. హిందూత్వ అనే పదాన్ని వి.డి సావర్కర్ ప్రతిపాదించారు. ఆర్ఎస్ఎస్ దాన్ని స్వీకరించింది. భారత దేశంలో పుట్టినవారు, భారత దేశానికి చెందిన వారు లేక భారత దేశంలో పుట్టిన మతాలను అనుసరించినవారు, లేక వాటిపై నమ్మకమున్న వారే హిందువులు అని ఆర్ఎస్ఎస్ రెండవ సర్‌సంఘ్‌చాలక్ అయిన గోల్వాల్కర్ నిర్వచించారు. ఈ నిర్వచనం ప్రకారం ముస్లింలు, క్రైస్తవులు హిందువులు కారు. అందువల్ల వారు విదేశీయులు. ఈ నిర్వచనం మన రాజ్యాంగంలో పొందుపరిచిన పౌరులు అనే భావననే వమ్ము చేస్తుంది.

బూర్జువాభూస్వామ్య పాలన కింద అనేక దశాబ్దాలపాటు పెట్టుబడిదారీ అభివృద్ధి జరిగిన నేపథ్యంలో మన దేశంలో హిందూత్వ మతతత్వం పెరిగింది. 1990 దశకంలో అధికారానికి చేరుకుంది. దేశంలో బూర్జువా ప్రజాతంత్ర లౌకిక రాజ్యన్ని ఏర్పాటు చేయడానికి బూర్జువా వర్గం ఎన్నుకున్న పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని 'నెహ్రూ మార్గం' అన్నారు. ఈ మార్గం సంక్షోభాలతో కూడుకున్నది. 1980వ దశకం వచ్చేసరికి అది ముందుకు కదలలేని స్థితికి వచ్చింది. ప్రజల భౌతిక పరిస్థితులు గణనీయంగా అభివృద్ధి కాకపోవడం, తమపై పడుతున్న భారాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అసంతృప్తి పెరగడం... వంటి పరిస్థితులను మతతత్వ శక్తులు తమ మతతత్వ ప్రచారానికి అనుకూలంగా ఉపయోగించుకున్నాయి. ప్రజల బాధలకూ, బూర్జువాభూస్వామ్య పాలన వైఫల్యాలకూ ముస్లింలు ప్రధాన కారణమంటూ వారిని లక్ష్యం చేసుకుని ప్రచారం చేశారు.

ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని హిందూత్వ శక్తులు మైనారిటీలను "ఇతరులు"గా పేర్కొన్నాయి. ముస్లిం మైనారిటీను "బుజ్జగిస్తున్నారు" అని గగ్గోలు లేపాయి. లౌకిక వాదాన్ని "ఓటు బ్యాంకు రాజకీయాలు" అని పేర్కొంటూ దుష్ప్రచారం చేశాయి. హిందువులను "బాధితులు"గా చూపెట్టాయి. ఈ ప్రచారాలతో ఆ శక్తులు బలం పుంజుకున్నాయి.

మత ఘర్షణలు, హింసాకాండ సృష్టించడం తద్వారా హిందూ ముస్లింల

మధ్య అంతరాన్ని పెంచడం అనే ఎత్తుగడను బ్రిటిష్ కాలం నుండి ఈ మతతత్వ శక్తులు అనుసరిస్తూ వచ్చాయి. మతతత్వ ప్రచారాన్ని ఒక పద్ధతి ప్రకారం నిర్వహించిన తరువాత కూడా ఈ పాత ఎత్తుగడలను వారు అలాగే కొనసాగిస్తూ వచ్చారు.

సామాజాన్ని మతతత్వ మయం గావించే క్రమం అకస్మాత్తుగా ప్రారంభం కాలేదు. ఒక పద్ధతి ప్రకారం నిర్వహిస్తూ వచ్చిన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సంఘసేవా కార్యక్రమాలకు పరాకాష్టగా ఇది జరిగింది.

ఈ రంగాలన్నిటిలో పనిచేసే మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్. రాజకీయ రంగంలో అది భారతీయ జన సంఘ్‌ను నెలకొల్పింది. తరువాత అది భారతీయ జనతా పార్టీ (బిజెపి)గా మారింది.

ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు నిర్వహించే కిందిస్థాయి పనినీ, కార్యకలాపాలనూ నిరంతరం తక్కువ అంచనా వేయడం జరుగుతోంది. బిజెపి రాజకీయ కార్యకలాపాలను మాత్రమే ఎదుర్కొనడానికి ప్రయత్నించడం జరుగుతోంది. కానీ ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని సంస్థలు సామాజిక, మతపరమైన, సాంస్కృతిక, విద్యా, సైద్ధాంతిక రంగాల్లో ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న పనిని ఎదుర్కోకుండా వదిలిపెట్టేస్తున్నాం. ఈ కార్యకలాపాలను తమ స్వంత చొరవలతో ఎదుర్కొనే వ్యూహాత్మకం ప్రణాళికలు కమ్యూనిస్టులు, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల వద్ద లేవు.

## మతతత్వం యొక్క వర్గ అంశం

పాలక వర్గాలు అవసరమైన చోటల్లా తమ వర్గ పాలనను సుస్థిరం చేసుకోడానికి మతతత్వాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకుంటాయి.

వర్గ ఐక్యతను, ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసే ఆయుధం మతతత్వం. గతంలో, 1990 దశకం ముందు, పాలక వర్గాలు ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని అణచివేసేందుకు, దారిమళ్లించేందుకు ఎక్కడవసరమైతే అక్కడ మతతత్వ శక్తులను ఉపయోగించుకునేవారు. కార్మికవర్గ ఉద్యమం బలంగా ఉన్న చోట దాన్ని చెదరగొట్టేందుకు మతతత్వ మితవాద శక్తులను

ఉపయోగించుకోడానికి ప్రయత్నించారు. ముంబయి, మహారాష్ట్రల్లో శివసేనను బడా పారిశ్రామిక వేత్తలు ఉపయోగించుకున్న తీరు దీనికి నిర్ధిష్ట ఉదాహరణ.

కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు మతఘర్షణలు ఒక మార్గం. 1960, 1970 దశకాల్లో ప్రధాన పారిశ్రామిక కేంద్రాలైన అహ్మదాబాద్, జమ్‌షెడ్‌పూర్, రాంచి, రూర్కెలాల్లో పెద్ద ఎత్తున మతఘర్షణలు జరిగిన విషయాన్ని మనం గుర్తించాలి.

**బడా బూర్జువా-హిందూత్వ పొత్తు**

పాలక వర్గాలకూ, మతతత్వ శక్తులకూ మధ్య సంబంధాల్లో గుణాత్మకమైన మార్పు వచ్చింది. మొదట 1992లో బడా బూర్జువా వర్గం తన మద్దతును కాంగ్రెస్ నుండి బిజెపికి మళ్లించడం చూశాం. బడా బూర్జువా వర్గంలోని పెద్ద భాగం బిజెపికి మద్దతు అందించింది. దాంతో బాబ్రీ మసీదు కూల్చివేతకు ముందు సంవత్సరాల్లో హిందూత్వ శక్తులు పెద్ద ఎత్తున పెరిగాయి.

అప్పటినుండి 2014 సార్వత్రిక ఎన్నికల ముందు వరకు బడా బూర్జువా వర్గం అటు కాంగ్రెస్, ఇటు బిజెపి నాయకత్వాల్లోని ఫ్రంటుల మధ్య ఊగిసలాడాయి. ఇది ఒక పెద్ద మార్పుకు దారితీసింది. బడా వ్యాపార-కార్పొరేట్‌లు, హిందూత్వ శక్తుల పొత్తు ఏర్పడింది. ఈ రెండు శక్తులూ నరేంద్ర మోడీని ప్రధాని అభ్యర్థిగా ముందుకు తెచ్చాయి. ఈ రోజు మనం ఎదుర్కొంటున్న మితవాద ఎదురుదాడి వెనుక ఈ బడా బూర్జువా, హిందూత్వ శక్తుల కూటమి ఉంది.

పాలక వర్గాల్లోని ఒక పెద్ద సెక్షను బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి వెనుక ఉందని అన్ని రకాల సూచనలు తెలియజేస్తున్నాయి. గతంలోనే ప్రారంభమైన కాంగ్రెస్ పతనం ఈ కారణంగా మరింత ఘనీభవించింది.

దేశం నేడు కొత్త పరిస్థితిని ఎదుర్కొంటోంది. అదేమంటే, ఆర్‌ఎస్‌ఎస్, హిందూత్వ శక్తులు ప్రభుత్వంలోకి ప్రవేశించి రాజ్య యంత్రాన్ని నియంత్రిస్తున్నాయి. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వ కాలంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు రాజ్యానికి చెందిన కీలకమైన సంస్థలు ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి కూటమి నియంత్రణలోకి వచ్చాయి.

ఆర్ఎస్ఎస్ రాజ్య యంత్రంలోపలి నుండి 'అధికారికంగా' తన మతతత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోతోంది. హిందూ రాష్ట్ర ఏర్పాటు చేయాలన్న తన అంతిమ లక్ష్యాన్ని చేరుకోడానికి ఆర్ఎస్ఎస్‌కు మార్గం తెరుచుకుంది.

మోడీ ప్రభుత్వం దిగువ స్థాయిలో ప్రజల్లో మతతత్వ చైతన్యాన్ని పెంచడానికి గత మూడేళ్లల్లో దుడుకుగా, ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నించింది. 'జాతీయవాదం' పేరుతో ఇదంతా జరుపుతోంది. కానీ ఇది నిజానికి హిందూ జాతీయవాదం. అది ముస్లింలను లక్ష్యంగా చేసుకుంటుంది. దేశంలోపల మత ఉద్రిక్తలను నిరంతరం సలసల కాగుతుండేట్లు చేయడానికి పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెంచుతోంది.

## మైనారిటీ మతతత్వం

మెజారిటీ మతతత్వ దుందుడుకు కార్యక్రమాలు మైనారిటీ మతతత్వ పెరుగుదలకు ఆజ్యం పోస్తున్నాయి. హిందూత్వ దాడులతో భయపడిపోయి, అభద్రతకు లోనైన మైనారిటీలు ముస్లిం మతతతత్వ వాదులకు లోబడిపోతున్నారు. హిందూత్వ మతతత్వాన్ని ఛాందసవాదంతోనూ, వేర్పాటువాద అస్థిత్వంతోనూ ఎదుర్కోవాలని ఈ ముస్లిం మతతత్వ వాదులు ప్రయత్నిస్తున్నారు.

ముస్లిం మతస్తులకు వ్యతిరేకంగా ఊచకోతలకు పాల్పడ్డం, అమాయక ముస్లిం యువకులపై ప్రభుత్వమే 'ఉగ్రవాదులు'గా ముద్రవేయడం వంటి చర్యలు ముస్లిం ఉగ్రవాదం పెరగడానికి మార్గం ఏర్పరుస్తున్నాయి. దీనివల్ల మెజారిటీ మతతత్వానికి ప్రతిగా టెర్రరిస్టు కార్యకలాపాలు పెరగవచ్చు.

ఫలితంగా మెజారిటీ మతతత్వం, మైనారిటీ మతతత్వం ఒకదాన్ని మరొకటి పోషించుకుని, బలపరుచుకుంటాయి.

అందువల్ల, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు చురుకుగా జోక్యం చేసుకుని మైనారిటీల హక్కులను సమర్ధించడం, రక్షించడం చాలా ముఖ్యం. ఇది చేస్తూనే ఛాందసవాద, ఉగ్రవాద శక్తులను తిప్పికొట్టాలి.

## మతతత్వానికీ, నయా–ఉదారవాద విధానాలకూ వ్యతిరేకంగా జరిగే పోరాటాలను సమ్మిళితం చేయాలి

హిందూత్వ మతతత్వం నయాఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకం కాదు. పైగా నయాఉదారవాదాన్ని మరింత దుడుకుగా ముందుకు తీసుకుపోడానికి హిందూత్వ బాగా పనికొస్తుందని పాలక వర్గాలు గుర్తించాయి.

అందువల్లనే హిందూత్వ మతతత్వానికి వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని నయా-ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజలు జరిపే పోరాటాలతో కలిపి నిర్వహించాలి.

దీనిపై మన పార్టీ 21వ మహాసభ రాజకీయ తీర్మానం ఇలా వివరించింది:

*"హిందూత్వ శక్తులకూ, మతతత్వానికి సంబంధించిన ఇతర శక్తులకూ వ్యతిరేకంగా జరిపే పోరాటాన్ని, నయా-ఉదారవాద విధానాలకూ, శ్రామిక ప్రజలపై వాటి ప్రభావాలకూ వ్యతిరేకంగా జరిపే పోరాటాలతో సమ్మిళితం చేయాలి. ప్రజల జీవన ప్రమాణాలను కాపాడుకోవడం కోసమూ, బిజెపి కేంద్ర ప్రభుత్వమూ, బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలూ ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేంగానూ ప్రజలను సమీకరించడం వల్ల మాత్రమే ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలోని మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా జరిగే ప్రచారం ప్రజలను విస్తృతంగా ఆకట్టుకుంటుంది."*

దీంతోబాటు సమాజంలోని అన్ని రంగాల్లో ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహిస్తున్న బహుముఖ కార్యకలాపాలను తిప్పికొట్టాలి. పార్టీ మహాసభ ఈ విషయంలో కింది విధంగా మార్గదర్శనం చేసింది:

*"రాజకీయ పోరాటాలతోపాటు పార్టీ, ప్రజాసంఘాలు ఈ క్రింది చర్యలు చేపట్టాలి*

*1) హిందూత్వ శక్తుల, ఇతర రూపాల్లోని మతతత్వ శక్తుల అభివృద్ధి నిరోధక, విచ్ఛిన్నకర లక్షణాలను ఎండగట్టేందుకు చాలా సులభమైన రీతిలో, ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో సైద్ధాంతిక, రాజకీయ ప్రచార సరంజామా రూపొందించాలి. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక ప్రచారం నిర్వహించేందుకు మేధావులనూ, చరిత్రకారులనూ, సాంస్కృతిక రంగ ప్రముఖులనూ సమీకరించేందుకు మన పార్టీ నడుపుతున్న పరిశోధనా కేంద్రాలనూ, మేధో వనరులనూ ఉపయోగించుకోవాలి.*

*2) విద్యా రంగంలో ఉపాధ్యాయులూ, సామాజిక సంస్థల సహకారంతో పాఠశాల పూర్వ, పాఠశాల స్థాయిలో మనం చొరవ తీసుకుని కార్యక్రమాలు నిర్వహించాలి.*

*3) కార్మికవర్గంలోనూ, కార్మికవర్గం నివసించే ప్రాంతాల్లోనూ లౌకిక, శాస్త్రీయ దృక్పథాలను ప్రచారం చేసేందుకుగాను సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ, ట్రేడ్‌యూనియన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.*

*4) మతతత్వ శక్తులు ముందుకు తెచ్చే హానికరమైన విలువలనూ, కులతత్వ, ఛాందసవాద విలువలనూ తిప్పికొట్టే ఉద్దేశంతో సాంస్కృతిక, సామాజిక కార్యకలాపాలను అభివృద్ధి చేయాలి. దీనికోసం ప్రజా సైన్సు ఉద్యమాన్ని పెద్ద ఎత్తున రంగంలోకి దించాలి.*

*5) ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న బహుముఖ కార్యకలాపాలను ఎదుర్కొనేందుకుగాను దళితులు, ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో పార్టీ నిర్మాణ కృషిని పెంచాలి.”*

*భారత దేశంలో కులం, లిగ భేదం (జెండర్), మతతత్వ (కమ్యూనల్) సమస్యలను మార్క్సిస్టులు వర్గ దక్కోణం నుండి చూస్తారు. కులం, లైంగిక అణచివేత, మతతత్వ ప్రమాదాలను మనం ఎలా ఎదుర్కొంటాం అన్నది మన దేశంలో వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకుపోడానికీ, జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదం చేయడానికీ అత్యంత కీలకమైన అంశం.*